

తీజ్ సందడి
గంభీరావుపేట(సిరిసిల్ల): మక్తనాయక్‌తండాలో గురువారం తీజ్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ హాజరయ్యారు.



బెనిఫిట్స్ అందించాలి
సిరిసిల్లఅర్బన్: రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష అందించాలని కోరుతూ గురువారం అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యం
- వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, ఏఎస్సై ప్రమీల

వేములవాడఅర్బన్: విద్యార్థినుల భద్రతకు జిల్లా పోలీస్‌శాఖ అధిక ప్రాధాన్యతనిస్తుందని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పేర్కొన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని నిర్మల పాఠశాలలోని విద్యార్థులకు పోక్సోచట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి మాట్లాడుతూ మైనర్ బాలికలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారికి పోక్సో చట్టం ప్రకారం జీవితఖైదీ వంటి శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. అసభ్య ప్రవర్తన, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌ల గురించి వివరించారు. విద్యార్థులు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వంటి వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వేధింపులకు గురైతే జిల్లా షీటీమ్ 87126 56425లో ఫిర్యాదు చేయాలని కోరా రు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, షీటీమ్ ఏఎస్సై ప్రమీల, సిబ్బంది రమాదేవి, ప్రియాంక, సఖీ కో–ఆర్డినేటర్ రోజా పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో పెట్టవద్దు
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల/తంగళ్లపల్లి: తహసీల్దార్ ఆఫీస్‌లకు స్లాట్‌బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వాటిని పెండింగ్‌లో పెట్టవద్దని, మీసేవ ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. సిరిసిల్ల, తంగళ్లపల్లిలోని తహసీల్దార్ ఆఫీస్‌లను గురువారం తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులను, సిబ్బంది హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రైతులతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. సిరిసిల్ల తహసీల్దార్ షరీఫ్ మొహియొద్దీన్, తంగళ్లపల్లి తహసీల్దార్ జయంత్‌కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల కోసం సీఎంకు లేఖలు



లేఖలు చూపుతున్న విద్యార్థులు

ముస్తాబాద్(సిరిసిల్ల): తమ మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ ముస్తాబాద్‌లోని స్కూల్ విద్యార్థులు డిగ్రీ కళాశాల సాధన కమిటీ కన్వీనర్ చింతోజు బాలయ్య ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశారు. డిగ్రీ కాలేజీ కోసం ఏళ్లుగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మాజీ ఎంపీటీసీ మిర్యాల్‌కార్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి
- డీఆర్డీవో శేషాద్రి



కోళ్లు పంపిణీ చేస్తున్న డీఆర్డీవో శేషాద్రి

సిరిసిల్ల: మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీవో శేషాద్రి కోరారు. ఇందిరా మహిళాశక్తిలో భాగంగా ముస్తాబాద్, కోనరావుపేట, తంగళ్లపల్లి, వేములవాడరూరల్, బోయినపల్లి, గంభీరావుపేట, చందుర్తి మండలాల్లో గురువారం 5,500 సోనాలి బ్రీడ్ కోళ్లు పంపిణీ చేశారు. మహిళలు ఉపాధి సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. ఒక్కొక్కరికి 35 నుంచి 50 కోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అదనపు డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్, డీపీఎంలు పద్మయ్య, సుధారాణి, ఏపీఎంలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిర్మూలనే లక్ష్యం
- డీఎంహెచ్‌వో వసంతరావు

సిరిసిల్లటౌన్: హెచ్‌ఐవీ నిర్మూలనే లక్ష్యంగా వైద్యశాఖ పనిచేయాలని జిల్లా వైద్యాధికారి వసంతరావు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం మిడ్‌లెవల్ హెల్త్ కేర్ ప్రొవైడర్లు(ఎంఎల్‌హెచ్‌పీ)లకు ఎయిడ్స్ నిర్మూలనపై శిక్షణలో మాట్లాడారు. హెచ్‌ఐవీ సురక్షితం కాని సంపర్కం, కలుషితమైన రక్త మార్పిడి, కలుషితమైన సూదులు, సిరంజీలతోపాటు తల్లి నుంచి కడుపులో బిడ్డకు రక్తమార్పిడీ ద్వారా సంక్రమిస్తుందని తెలిపారు. హెచ్‌ఐవీ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రజిత, రాజగోపాల్ రెడ్డి, అంజలి, నైమ్‌జాన్, డీపీఎం సురేందర్ బాబు, ఉమాదేవి పాల్గొన్నారు.

పెంచుకో.. పంచుకో!

- బల్దియాలో వింత పోకడ
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందిలో కొందరి వేతనాలే పెంపు!
- ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు
- రేపు సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- ఎజెండా అంశంగా వేతనాల పెంపు నిర్ణయం
- ఏకపక్ష నిర్ణయమంటూ కౌన్సిలర్ల గుర్రు

సిరిసిల్లటౌన్: ఆదాయ వనరులు సృష్టించుకోవడంలో సిరిసిల్ల బల్దియా పాలకవర్గం రూటే సెపరేటు'. కొందరి వేతనాలు అమాంతం పెంచే నిర్ణయం తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. బల్దియా పరిధిలో 350 మంది ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తుంటే కేవలం 10 మంది వేతనాలు మాత్రమే పెంచాలనే నిర్ణయంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. శనివారం జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయాన్ని ఎజెండాలో ప్రవేశపెట్టాలని పాలకవర్గం చూస్తుండగా.. నిలదీసేందుకు పలువురు కౌన్సిలర్లు సమాయత్తమవుతున్నారు. ముఖ్య ప్రజాప్రతినిధుల ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న వైనంపై 'సాక్షి' పరిశోధనాత్మక కథనం.

అసలు ఏం జరిగింది?
సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించనున్నారు. ప్రతిపక్షం నుంచి కౌన్సిల్‌లో అభ్యంతరాలు రాకుండా వారి సంబంధీకులకూ జీతాలు అమాంతం పెంచి ఎజెండా రూపొందించినట్లు స్వపక్ష, ప్రతిపక్షాలకు చెందిన కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పెంచడానికి సంబంధించిన ఎజెండాలోని అంశాలు నంబర్లు 17, 18లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్‌లో దాదాపు 350 మంది ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నారు. వీరిలో 10 మందికే వేతనాలు పెంచాలని తీర్మానం ప్రవేశపెట్టాలనుకోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. గతంలోనూ పాలకవర్గంలోని ఐదారుగురు పెద్ద తలకాయలు తీసుకున్న నిర్ణయాలు బల్దియా ప్రతిష్ఠను బజారు పాలు చేసిందని గుర్తుచేస్తున్నారు.



సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం

విమర్శలు ఇలా..
- బల్దియాలోని వాటర్‌సప్లయ్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్ విభాగాల్లో సుమారు 350 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరంతా ఏళ్లుగా జీతాలు పెంచాలని కోరుతున్నా నిధుల లేమి పేరుతో పెంచకుండా నెట్టుకొస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 8 మంది, సిస్టం మేనేజర్, సిస్టం అసిస్టెంట్ ఒక్కొక్కరు మొత్తంగా 10 మందికే జీతాలు పెంచాలనే నిర్ణయాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇందులో ఒక ఉద్యోగి కౌన్సిలర్‌గా పోటీచేయగా.. విధుల నుంచి తప్పించారని, అతని సీనియారిటీని ఎలా నిర్ణయించారని ప్రశ్నిస్తున్నారు. పాలకవర్గంలో పెద్దలు తమ అనుకూలురకే జీతాలు పెంచుతున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. నిజానికి పాలకవర్గం పెద్దలు నిర్ణయించిన పలువురు చాలా ఏళ్లుగా విద్యార్హతలు(డిప్లొమా సర్టిఫికెట్లు) లేకుండానే మున్సిపల్‌లో పనిచేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సదరు ఉద్యోగులు ఎప్పుడు డిప్లొమా కోర్సులు పూర్తిచేశారని వివరాలు చెప్పాలని కోరుతున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పెంచితే సుమారు 30శాతం వరకు పెంచుతారని, అమాంతం సుమారు 140 శాతం పెంచడం ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
- సిస్టం మేనేజర్ ప్రతిపక్ష ప్రజాప్రతినిధి బంధువు కావడంతోనే రేపటి సమావేశంలో అభ్యంతరాలు లేవనెత్తకుండా అతని వేతనం సైతం పెంచి రాజకీయం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమించలేదు



జీతాల పెంపు అంశంలో నిబంధనలు అతిక్రమించలేదు. ప్రభుత్వ జీవోల ప్రకారమే జీతాల పెంపుపై సీడీఎంఏ నుంచి ఆమోదం కోసం కౌన్సిల్ అనుమతిని కోరుతూ తీర్మానాలు ప్రవేశపెడుతున్నాం. సిస్టం మేనేజర్, సిస్టం అసిస్టెంట్, ఇంజిఇనీరింగ్ విభాగంలో సిబ్బందికి టెక్నికల్ విద్యార్హతలున్నాయి. జీవో నంబర్ 4, జీవో నంబర్ 970 ప్రకారం వారి వేతనాల పెంపునకు ప్రతిపాదనలు చేశాం. కౌన్సిల్ తీర్మానిస్తేనే ఉన్నతాధికారులకు పంపిస్తాం. వేతనాలు ఖచ్చితంగా పెంచుతామనే విషయం ప్రస్తావన లేదు. ఇతర విభాగాల్లోని ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వ జీవోల ప్రకారమే వేతనాలు చెల్లిస్తున్నాం.
– మీర్జా ఫసహత్ అలీబేగ్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

జీతాలు పెంచడంలో కారణాలివీ..
- టెక్నికల్ విద్యార్హతలు గల వారికి జీతాలు పెంచడానికి ప్రభుత్వం జీవోలు జారీచేసిందని అధికారులు చెబుతున్నారు.
- పురపాలకసంఘంలో ఇంజినీరింగ్ విభాగంలో నలుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు పదేళ్లుగా పనిచేస్తున్నారు. వారు అదనంగా వార్డు ఆఫీసర్ల బాధ్యతలు సైతం నెరవేరుస్తున్నారు.
- నాన్‌టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు మరో నలుగురు 20 ఏళ్లుగా కార్యాలయం విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి 11–06–2021 నాడు వచ్చిన జీవో ప్రకారం మొదటి కేటగిరీలో నెలకు రూ.16,600 చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు.
- వేతనాలు పెంచాలని జీవో ఎంఎస్ నంబర్ 4, తేదీ. 06–01–2022 ప్రకారం సదరు ఉద్యోగులు చైర్‌పర్సన్, కమిషనర్లకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో నెల జీతం రూ.19,500, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ అలవెన్సులు కలిపి నెలకు ఒక్కొక్కరికి రూ.6,337.50 మొత్తంగా రూ.25,837.50 చెల్లించుటకు నిర్ణయించారు.
- ఒకరు సిస్టమ్ మేనేజర్, మరొకరు సిస్టమ్ అసిస్టెంట్‌ల వేతనం పెంపు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం సిస్టమ్ మేనేజర్‌కు రూ.19,500, సిస్టం అసిస్టెంట్‌కు రూ.15,500 ఇస్తున్నట్లు సమాచారం. కాగా జీవో ఎంఎస్ నంబర్ 970 ప్రకారం సిస్టమ్ మేనేజర్‌కు నెలకు రూ.36,140, సిస్టం అసిస్టెంట్‌కు రూ.22,750 చెల్లించుటకు తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది.
- ఇతర విభాగాల్లోని టెక్నికల్ అర్హతలున్న సిబ్బందిని కలపకుండా 10 మంది వేతనాలు మాత్రమే పెంచడంపై ఆరోపణలు వస్తున్నాయి.

భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు
- ఎస్పీ అఖిల్‌మహాజన్



వేములవాడ: రౌడీషీటర్లు విధిగా ఠాణాల్లో హాజరుకావాలని లేకుంటే బైండోవర్ చేస్తామని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. రౌడీ, హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేములవాడ టౌన్ ఠాణాలో వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, బోయినపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నేరచరిత గల వారికి గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి కిట్లతో టెస్టులు చేస్తూ నియంత్రిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, పృథ్వీధర్, అంజయ్య ఉన్నారు.

కిషన్‌కు గూడూరి సీతారాం కథా పురస్కారం

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ తొలితరం కథారచయిత గూడూరి సీతారాం స్మారకార్థం ఏటా ఇచ్చే పురస్కారానికి ఈసారి వేములవాడకు చెందిన పిన్నింటి కిషన్ ఎంపికయ్యారు. సీతారాం కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ పురస్కారాన్ని తొలిసారి కథకుడు, జర్నలిస్టు పూడూరి రాజిరెడ్డి, రెండో పురస్కారాన్ని మిర్యాలగూడకు చెందిన కథారచయిత సూర్య ధనుంజయకు ప్రదానం చేశారు. ఈసారి బడుగు జీవుల వెతలను కథలుగా చిత్రించిన కిషన్‌ను ఎంపిక చేసినట్లు న్యాయ నిర్ణేతల బృందం ప్రకటించింది. త్వరలో జరిగే ప్రత్యేక సమావేశంలో పురస్కారాన్ని అందజేయనున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి ప్రకటించారు. పురస్కారం కింద రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



దేవేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి బండి సంజయ్‌కుమార్

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎవరూ అధైర్య పడొద్దని, బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ భరోసానిచ్చారు. జిల్లాలో ఇటీవల చనిపోయిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను గురువారం పరామర్శించారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నేవూరి దేవేందర్‌రెడ్డి ఇటీవల గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకోగా.. మృతికి గల కారాణాలు అడిగి తెలుసుకున్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పార్టీ బలోపేతానికి పనిచేశాడని గుర్తుచేశారు. అనంతరం స్థానిక మున్నూరుకాపు సంఘం సభ్యులు సంఘ భవనానికి రూ.10లక్షలు మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. అక్కడ ఉన్న చిన్నారులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బందారపు లక్ష్మారెడ్డి తండ్రి సంవత్సరీకం ఉండగా, వారి ఇంటికెళ్లి కలిశారు. పార్టీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు మద్దుల బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, సాయిలు, లక్ష్మారెడ్డి, నంది నరేశ్, మేగి నర్సయ్య ఉన్నారు.

కరెంట్ బిల్లులకు ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోంది
వస్త్రోత్పత్తిదారులకు 50 శాతం సబ్సిడీపై కరెంట్ సరఫరా చేయాల్సి ఉండగా.. కోర్టు ఆదేశాలు ఉన్నాయని రూ.లక్షల్లో కరెంట్ బిల్లులు విధిస్తుండడంతో నేతన్నలు ఆస్తులు అమ్ముకోవాల్సిన వస్తోందని బండి సంజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంకంపేటలోని ఊరగొండ రాజు, పద్మనగర్‌లో పచ్చనూరి సురేశ్ కుటుంబాలను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పరిశ్రమ సంక్షోభంలో ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.

విలీన గ్రామాలను వేరు చేయాలి
సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనమైన ఏడు గ్రామాలను వేరుచేయాలని బండి సంజయ్‌కుమార్ కోరారు. ఎన్నికల ముందు బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు విలీన గ్రామాలను మళ్లీ గ్రామపంచాయతీలుగా మార్చుతామని హామీ ఇచ్చాయని గుర్తుచేశారు. విలీన గ్రామాల ఉద్యమానికి బీజేపీ మద్దతు ఇస్తుందని తెలిపారు. రెడ్డబోయిన గోపి, నాగుల శ్రీనివాస్, గూడూరి భాస్కర్, బొల్గం నాగరాజుగౌడ్, బర్కం లక్ష్మి, నవీన్‌యాదవ్, అన్నల్‌దాస్ వేణు, బండ మల్లేశంయాదవ్ ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి
- డీఈవో రమేశ్‌కుమార్



విజేతలకు ట్రోఫీలు అందిస్తున్న డీఈవో

సిరిసిల్ల: యువత క్రీడల్లో రాణించాలని, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో ముందుకుసాగాలని డీఈవో రమేశ్‌కుమార్ కోరారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలతో గురువారం సిరిసిల్ల మినీస్టేడియంలో ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా 'జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. ఉద్యోగులకు పురుషులకు వాలీబాల్, బాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించారు. మహిళలకు షాట్‌పుట్, చెస్, టగ్ ఆఫ్ వార్, బాడ్మింటన్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి అజ్మీరా రాందాస్, వ్యాయామ ఉపాధ్యాయులు డి.ప్రభాకర్, ఉప్పల శ్రీనివాస్, గణేశ్ పాల్గొన్నారు. క్రీడాపోటీల్లోని విజేతలకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందించారు.

మురికిగా ధర్మగుండం నీళ్లు



వేములవాడ: శ్రావణమాసం కొనసాగుతుండటంతో కొద్ది రోజులుగా నిత్యం వేలాది మంది భక్తులతో రాజన్న ఆలయం రద్దీగా మారింది. దర్శనానికి వచ్చిన భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేయడంతో నీళ్లు మురికిగా మారాయి. గురువారం ఇలా పచ్చబడినట్లు భక్తులకు కనిపించడంతో స్నానాలు చేసేందుకు ఇబ్బందిపడ్డారు. ఆలయ అధికారులు స్పందించి పచ్చబడ్డ నీళ్లు తొలగించి స్వచ్ఛమైన గోదావరి జలాలను నింపాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

ఓటరు జాబితా రూపొందించండి

- ఎన్నికల సిబ్బందిని గుర్తించాలి
- రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి
- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా అధికారులు

సిరిసిల్ల: గ్రామపంచాయతీల వారీగా ఓటర్, పోలింగ్‌స్టేషన్ల జాబితా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీపీవోలతో గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం ముందుకెళ్లాలని, ఓటర్ జాబితా తయారీ, మ్యాపింగ్ పనులు చేసేందుకు ప్రతీ మండలంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని సూచించారు. అన్ని మండలాల్లో కావాల్సిన అధికారులు, సిబ్బంది ఉన్నారో లేదో తెలుసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారు ఇచ్చిన ఓటర్ జాబితాకు అనుగుణంగా గ్రామాలవారీగా లిస్టు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతీ పోలింగ్‌స్టేషన్ పరిధిలో 600–650 మంది ఓటర్లు ఉండేలా చూసుకోవాలని, ఓటర్లను బట్టి కేంద్రాలను సిద్ధం చేయాలని తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా ఎదురైనా సమస్యలు గుర్తించాలని, మరోసారి రాకుండా చూడాలని ఆదేశించారు.

ఓటర్ జాబితా ప్రదర్శన
పల్లెల్లో వార్డులవారీగా రూపొందించిన ఫొటోలతో కూడిన ఓటర్ జాబితాను సెప్టెంబరు 6న అన్ని గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. సెప్టెంబరు 9న అన్ని రాజకీయపార్టీలతో, 10న జిల్లాస్థాయి ఎన్నికల అధికారులతో, మండల స్థాయిలో ఎంపీడీవోలు సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఓటర్ జాబితాపై అభ్యంతరాలను సెప్టెంబరు 7 నుంచి 13 వరకు స్వీకరించాలని తెలిపారు. అభ్యంతరాలు సెప్టెంబరు 19వ తేదీలోగా జిల్లా పంచాయతీ అధికారి ద్వారా పూర్తి చేయాలని, పూర్తిస్థాయి వార్డులు, ఫొటోలు, ఓటర్‌జాబితాను అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలని ఆదేశించారు.

జిల్లా అధికారులకు ప్రశంసలు
ఓటర్ జాబితా తయారీ, పోలింగ్‌కేంద్రాల వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్, రూపొందించడంలో ఉత్తమ ప్రతిభ చూపిన జిల్లా అధికారులను రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి ప్రశంసించారు. జిల్లాలో గ్రామపంచాయతీలు 266 ఉండగా, టీ–పోల్ అప్లికేషన్‌లో 172 పూర్తి చేశామని, మొత్తం ఓటర్లు 3,49,391 మంది ఉన్నారని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు. ఓటర్ జాబితాను ఫిబ్రవరి 8 వరకు పూర్తి చేశామని వివరించారు. పూర్తి సప్లీమెంట్రీ జాబితా త్వరలో విడుదల కానుందని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు

- అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బంది
- పోతే ఎప్పుడు వస్తుందో తెలియదు
- సిరిసిల్ల 'సెస్'పై ఎన్పీడీసీఎల్ చిన్నచూపు



ఇది సిరిసిల్ల శివారులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్. సాంకేతిక సమస్య రావడంతో మరమ్మతు చేస్తున్నారు. ఫలితంగా ఆ సబ్‌స్టేషన్ పరిధిలో రిపేర్ పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యలు వస్తే ఎన్పీడీసీఎల్ అధికారులు రిపేర్ చేయాలి. కానీ జిల్లాలో విద్యుత్ సరఫరా బాధ్యత సెస్ చూస్తుండడంతో ఆ సంస్థ సిబ్బంది మరమ్మతు చేస్తున్నారు. సాంకేతిక సమస్యలు వస్తే చాలు సెస్ పరిధిలో కరెంట్ సరఫరా నిలిచిపోతుంది.



ఇది సిరిసిల్ల పట్టణంలోని 11 కేవీ విద్యుత్ లైన్ ట్రాన్స్‌ఫార్మర్. విద్యుత్ తీగలను అమర్చిన పరికరం కాలిపోవడంతో బ్రేక్ డౌన్ కావడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఎక్కడ బ్రేక్ డౌన్ అయిందో తెలుసుకుని.. సమస్యను పరిష్కరించే వరకు కరెంట్ కోత తప్పలేదు. సమస్య పరిష్కరించే వరకు సిరిసిల్లలో సాంచాలు బంద్‌పడ్డాయి.

సిరిసిల్ల: జిల్లాలో అప్రకటిత విద్యుత్‌కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనూ ఇలాంటి సమస్యలు ఉన్నా ఇంత ఎక్కువగా రాలేదు. జిల్లాకు ఎన్పీడీసీఎల్ విద్యుత్‌ను అందిస్తున్నా.. సరఫరా బాధ్యతలు మాత్రం సెస్ సంస్థ నిర్వహిస్తుంది. ఈ కారణంతోనే జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య ఎదురైనా ఎన్పీడీసీఎల్ అధికారులు పట్టించుకోరు. సెస్ సంస్థ సిబ్బంది మాత్రమే ఆ సమస్యను గుర్తించి పరిష్కరిస్తారు. ఇటీవల తరచూ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

ఇదీ తాజా కరెంట్ కోతల ప్రకటన
సిరిసిల్ల శివారులోని శివనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా 30 నిమిషాలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని 'సెస్' అధికారులు గురువారం సాయంత్రం ప్రకటించారు. దీంతో సిరిసిల్లలోని నెహ్రూనగర్, వెంకట్రావునగర్, సాయినగర్, సుభాష్‌నగర్, విద్యానగర్, ఆదర్శనగర్, గోపాల్‌నగర్, బీ.వై.నగర్, గణేశ్‌నగర్, కొత్తబస్టాండు ఏరియా, శివనగర్, ఇందిరానగర్, బాబానగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలిగింది. ఇలా నిత్యం ఏదో ప్రాంతంలో అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతున్నాయి.

వ్యవసాయానికి 18 గంటలు
జిల్లాలో వ్యవసాయానికి 18 గంటల విద్యుత్ సరఫరా అమలు చేస్తున్నారు. రాత్రి 11.30 గంటలకు త్రీఫేజ్ కరెంట్ వస్తుంది. మళ్లీ మరసటి రోజు సాయంత్రం 5.30 గంటల వరకు 18 గంటలపాటు నిరాటంకంగా విద్యుత్ సరఫరా అవుతుంది. ఎప్పుడైనా.. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు వస్తే 18 గంటల విద్యుత్ సరఫరాలో కోతలు ఉంటాయి. సిరిసిల్లలో వస్త్రోత్పత్తి రంగం, పరిశ్రమలు, కుటీరపరిశ్రమలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు.. అప్రకటిత విద్యుత్ కోతలతో విలవిల్లాడుతున్నాయి.

సిబ్బందిని అప్రమత్తం చేశాం



'సెస్' పరిధిలో సిబ్బందిని అప్రమత్తం చేశాం. విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలంలో సాంకేతిక సమస్యలు ఎప్పుడైనా రావచ్చు. అది మన పరిధిలో ఉండదు. సమస్య ఎప్పుడు వచ్చినా వెంటనే సరిచేసేలా చూస్తున్నాం. ముందుగానే పోల్ టు పోల్ సర్వే చేసి సమస్య గుర్తించి సరిచేస్తున్నాం. మొన్నటి వరకు పిడుగుపాటు, ఈదురుగాలులతో సమస్యలు ఎదురయ్యాయి. కోతలు లేకుండా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటాం. – ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, 'సెస్' ఎండీ

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


నవీన్ (ఫైల్)

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజీపేటకు చెందిన విక్కుర్తి నవీన్ (27) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మారుతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్–లక్ష్మి దంపతులకు నవీన్ ఒక్కడే సంతానం. కొన్ని రోజులుగా పెళ్లి సంబంధాలు వస్తున్నా కుదరకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. గురువారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కొన్నేళ్లుగా గల్ఫ్‌లో ఉంటున్న తండ్రి చంద్రశేఖర్ తన కుమారుడికి పెళ్లి చేయాలని ఇటీవలే ఇంటికి వచ్చినట్లు తెలిసింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మల్లాపూర్(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లికి చెందిన పోతూరి శివరామకృష్ణ(30) ఈ నెల 28న తన అక్కను బైక్‌పై తీసుకెళ్లి, మల్లాపూర్ మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో గల ఆమె అత్తింట్లో దింపాడు. తిరిగి అతివేగంగా వస్తున్నాడు. మొగిలిపేట శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి, అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. శివరామకృష్ణ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి, రెండు నెలల క్రితమే ఇంటికి వచ్చాడు. ఇతను అవివాహితుడు.

అస్వస్థతకు గురై సింగరేణి సెక్యూరిటీగార్డు మృతి


కనకయ్య (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2లో సెక్యూరిటీగార్డుగా పని చేస్తున్న నల్లవెల్లి కనకయ్య(55) మృతి చెందాడు. గురువారం డ్యూటీకి హాజరైన ఆయన మస్టర్ పడి, ఓసీపీ–3 మినీ సీహెచ్‌పీ చెక్‌పోస్టు వద్ద విధుల నిర్వహించేందుకు బైక్‌పై వెళ్తుండగా గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురై, కిందపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

దాడి చేసినవారిని అరెస్టు చేయాలి

- రాష్ట్ర డీజీపీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్‌లకు బాధితురాలి ఫిర్యాదు


జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న స్వప్న

గోదావరిఖనిటౌన్(రామగుండం): ఏఐటీయూసీ, సీపీఐ నాయకుడు మడ్డి ఎల్లయ్యగౌడ్, ఆయన అనుచరులను అరెస్టు చేయాలని సింగరేణి మహిళా కార్మికురాలు, గోదావరిఖనికి చెందిన జనగామ స్వప్న కోరింది. వారు తనను కులం పేరుతో దూషిస్తూ, దాడి చేసి, గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర డీజీపీ జితేందర్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు ఎల్లయ్యగౌడ్‌కు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించింది. దళిత సంఘాల నాయకులు ఆమె వెంట ఉన్నారు.

కార్ల షోరూంలో చోరీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని మాలిక్ కియా కార్ల షోరూంలో రూ.3.6 లక్షలు చోరీ అయినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఈ నెల 28న రాత్రి(బుధవారం) షోరూంకు నిర్వాహకులు తాళం వేసి, వెళ్లిపోయారు. గురువారం ఉదయం సెక్యూరిటీగార్డులు వచ్చి, లోపలికి వెళ్లి చూడగా.. వెనకాల ఉన్న డోర్ పగులగొట్టి ఉంది. దీంతో వారు షోరూం సర్వీస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రవణ్‌కు ఫోన్ చేసి, విషయం చెప్పారు. ఆయన వెంటనే చేరుకొని పరిశీలించారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.3.6 లక్షలు చోరీకి గురయ్యాయని నిర్ధారించుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

ముస్తాబాద్(సిరిసిల్ల): గుడుంబా స్థావరాలపై డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడులు చేశారు. సేవా లాల్‌తండా, మొర్రాపూర్ తండాల్లోని పలువురి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. రెండు లీటర్ల గుడుంబా, 50 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ మొగిలి తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్సై గణేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

‘విద్యానిధి’ అందుకోండి

- ఉన్నత విద్యకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ఓ వరం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 10 దేశాల్లో చదివేందుకు అవకాశం
- రూ.20 లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తున్న ప్రభుత్వం
- కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ



కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యకు ప్రోత్సాహం అందిస్తోంది. ఈ మేరకు 2014లో అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని తీసుకువచ్చింది. ఇది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వరంగా మారింది. 2024–25 విద్యాసంవత్సరానికి గానూ విదేశాల్లో ఉన్నత చదువులు, ప్రత్యేక కోర్సులు పూర్తి చేసేందుకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న ఈ పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తోంది. ఈ రుణాన్ని రెండు విడతల్లో అందజేస్తారు. విద్యార్థులు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, 60 శాతానికి పైగా మార్కులు, విదేశాల్లో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ప్రవేశపత్రం పొంది ఉండాలి. జీఆర్‌ఈ, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, జీఎంఏటీ తదితర లాంగ్వేజీ కోర్సుల్లో అర్హత సాధించాలి. జాతీయ బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు ఉండాలి. వీటితోపాటు విద్యాసంవత్సరంలో గ్యాప్ ఉంటే దానికి సంబంధించిన వివరాలు, మీసేవ ద్వారా పొందిన కుల, ఆదాయ ధ్రువపత్రాలు జత చేయాలి. విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు వార్షికాదాయం గతంలో రూ.2 లక్షలు మాత్రమే ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం సడలించింది. 2018 నుంచి రూ.5 లక్షల వరకు పెంచింది. ఈ ఏడాదికిగానూ ప్రస్తుతం విద్యార్థుల నుంచి అధికారులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అక్టోబర్ 5వ తేదీ వరకు గడువు ఉంది. ఎక్కువ మందిని పంపేలా ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు ఎస్సీ సంక్షేమ శాఖ తరఫున ప్రచారం చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

ఈ దేశాల్లో చదివేందుకు అవకాశం

గతంలో 4 దేశాల్లోని యూనివర్సిటీల్లో మాత్రమే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకుంటే ఆర్థికసాయం చేసేవారు. ఈసారి ఆ సంఖ్యను 10 దేశాలకు పెంచారు. యూఎస్‌ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, దక్షిణ కొరియాల్లో చదువుకునేందుకు అవకాశం కల్పించారు. పథకం తీరుతెన్నులపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో ఆశించిన మేరకు దరఖాస్తులు రావడం లేదు.

సద్వినియోగం చేసుకోవాలి

విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనుకునే వారి కోసం ప్రారంభించిన అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఎంపికైతే భవిష్యత్ బాగుంటుంది. దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. మూడు నెలలకోసారి దరఖాస్తుకు అవకాశం ఇస్తారు. అభ్యర్థులకు ఉన్నతాధికారులు హైదరాబాద్‌లో ఇంటర్వ్యూ నిర్వహించి, ఎంపిక చేస్తారు.

– నగైలేశ్వర్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి, కరీంనగర్

ఆత్మహత్య కాదు.. హత్యే!

- బొప్పాపూర్‌వాసి మృతిపై తోబుట్టువుల అనుమానం
- విచారణ చేపట్టాలని వేడుకోలు


గంగాధర్ (ఫైల్)


మాట్లాడుతున్న మృతుడి తోబుట్టువులు

సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన గుంజ గంగాధర్ అనే దినసరి కూలీ కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే, అతని మృతిపై తోబుట్టువులు అనుమానం వ్యక్తం చేశారు. గురువారం రాజన్నసిరిసిల్ల జిల్లా ఆస్పత్రి మార్చురీ వద్ద మృతుడి అన్న సతీశ్, అక్క గంగమణి విలేకరులతో మాట్లాడారు. తమ తమ్ముడు కుటుంబ కలహాలతో ఉరేసుకోలేదని, ఇది హత్యేనంటూ విలపిస్తూ తెలిపారు. పోలీసులు హత్య కేసు నమోదు చేసి, విచారణ చేపట్టాలని కోరారు. గంగాధర్ భార్య పుట్టింటి వారిపై అనుమానాలున్నట్లు పేర్కొన్నారు. మృతుడి సోదరుడు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

చిన్నారి మృతదేహం వెలికితీత

- 28న రాత్రి మృతి.. అంత్యక్రియలు
- గ్రామస్తుల అనుమానంతో సమాధి తవ్వించిన పోలీసులు


సమాధిని తవ్విస్తున్న సీఐ సదన్‌కుమార్

మానకొండూర్ రూరల్: మండలంలోని వెల్ది గ్రామంలో ఓ చిన్నారి(35 రోజులు) మృతి చెందడంతో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేసి, సమాచారం అందించడంతో పోలీసులు వచ్చి, సమాధి తవ్వించారు. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. వెల్దికి చెందిన చందుపట్ల హర్షవర్ధన్ రెడ్డి భార్య 7 నెలల గర్భిణి. డెలివరీ సమయానికి ముందే గత జూలై 24న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. ఆ చిన్నారికి మెదడులో రక్తం గడ్డకట్టడంతో అక్కడే చికిత్స చేయించారు. 21న డిశ్చార్జ్ చేయడంతో ఇంటికి తీసుకొచ్చారు. 28న రాత్రి మృతిచెందగా కుటుంబసభ్యులు అదే రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. మరుసటిరోజు(గురువారం) ఉదయం గ్రామస్తులకు సమాధుల ప్రాంతంలో గోతి తవ్వినట్లు కనిపించడంతో అనుమానం వచ్చి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సదన్‌కుమార్ రాత్రి చేరుకొని, సమాధిని తవ్వించారు. పాప మృతదేహాన్ని వెలికితీసి, అక్కడే పంచనామా నిర్వహించారు. కారోబార్ మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని పెద్దంపేటకు చెందిన కాంపెల్లి శంకర్‌కు విద్యుత్ చౌర్యం కేసులో రూ.14,749 జరిమానా విధిస్తూ పెద్దపల్లి సెషన్స్ కోర్టు జడ్జి హేమంత్‌కుమార్ తీర్పు చెప్పారు. కరీంనగర్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.షాదుల్లా బాబా వివరాల ప్రకారం.. శంకర్ 2019 మే 31న తన ఇంటికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తూ విద్యుత్ అధికారులకు పట్టుబడ్డాడు. వారు కరీంనగర్ విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మొదటి నేరంగా పరిగణించి, రూ.500 జరిమానా విధించి, వదిలేశారు. అదే ఏడాది డిసెంబర్ 28న మళ్లీ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తూ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువవడంతో జడ్జి హేమంత్‌కుమార్ బుధవారం జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించకపోతే మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అవినీతి డొంక కదులుతోంది

- చందుర్తి పీఏసీఎస్‌లో రూ.32.34 లక్షలు దుర్వినియోగంపై ఫిర్యాదు
- తవ్వినకొద్దీ వెలుగుచూస్తున్న అక్రమాలు
- అందరూ పాత్రధారులే..


సొసైటీ గోదాంలో గన్నీ సంచులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో భారీగా అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. సొసైటీ సీఈవో, చైర్మన్‌తోపాటు సభ్యులు సైతం అక్రమాలకు పాల్పడ్డట్లు వెలుగుచూస్తోంది. బీనామీ రైతుల పేరిట పంటరుణాలతోపాటు గన్నీసంచులు, సుతిలీ కొనుగోలులోనూ అవినీతి జరిగినట్లు ఆరోపణలున్నాయి.

బహిరంగంగానే అక్రమాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీసంచుల రవాణా మొదలుకుని సుతిలి కొనుగోలు వరకు తప్పుడు లెక్కలు చూపినట్లు తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు రూ.13.48లక్షలు డ్రా చేయగా, వీటిలో సగానికి పైగా బిల్లులు చెల్లించలేదనే ఆరోపణలున్నాయి. సారంపల్లి గోదాంకు గన్నీసంచులు తరలించేందుకు రూ.7వేలు లారీ కిరాయి, రూ.4,500 హమాలీ ఖర్చుగా లెక్కలు చూపారు. సుతిలు రూ.1.90లక్షలకు కొని.. బిల్లులు మాత్రం రూ.3,46,500 చెల్లించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. ఈ బిల్లులు కూడా సొసైటీలో అందుబాటులో లేవు. ఇటీవల పెట్రోల్‌బంక్ ప్రారంభోత్సవ సమయంలో రెండు టెంట్లు, 400 కుర్చీలు, సౌండ్‌సిస్టమ్‌కు రూ.35వేలు చెల్లించారు. అయితే తమ అవినీతి గురించి మాట్లాడొద్దనే ఉద్దేశంతోనే అతనికి రెట్టింపు బిల్లు చెల్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ధాన్యం లేకుండానే ట్రక్‌షీట్లు

సనుగుల సింగిల్‌విండో పరిధిలోని కిష్టంపేటకు చెందిన ముగ్గురు రైతుల పేరిట 2022, జూన్ 12న అక్రమంగా ట్రక్‌షీట్‌ను సనుగుల సింగిల్‌విండో మాజీ చైర్మన్‌కు చందుర్తి సొసైటీ సిబ్బంది, సీఈవో అప్పగించారు. ఒక్క గింజ కూడా కొనకుండానే రైస్‌మిల్లులకు ధాన్యం తరలించినట్లు రికార్డు చేసి, ఆ డబ్బులను స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా మూడు సీజన్‌లలో చేసినట్లు సొసైటీ సిబ్బంది చర్చించుకుంటున్నారు. చందుర్తి సింగిల్‌విండో చైర్మన్‌కు సైతం ఈ అవినీతిలో వాటా ఉందనే ప్రచారం సాగుతోంది. రూ.23లక్షలు చైర్మన్‌కు అప్పగించినట్లు సీఈవో ఆరోపణలు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఇదే సమయంలో ఇప్పటికే రూ.2లక్షలు చైర్మన్ అతని సన్నిహితుని ద్వారా సీఈవోకు ముట్టజెప్పినట్లు చర్చించుకుంటున్నారు.

తప్పుడు ఆరోపణలు

సొసైటీలో అక్రమాలకు తనకు ఎలాంటి సంబంధం లేదు. బద్‌నామ్ చేసేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. గన్నీసంచులను వాపసు పంపేందుకు ముందస్తుగా కిరాయిలు మాట్లాడినారు. అందుకే లెక్కల్లో నమోదు చేశారు.

– తిప్పని శ్రీనివాస్, చందుర్తి సింగిల్‌విండో చైర్మన్

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

- 17న సౌదీలో గుండెపోటుతో మృతి
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు


రామస్వామి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

మెట్‌పల్లి(కోరుట్ల): ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన ఓ వలసజీవి అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. 10 రోజుల తర్వాత మృతదేహం ఇంటికి చేరడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్‌కు చెందిన అల్లె రామస్వామి (47) మెట్‌పల్లి పట్టణంలోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. స్థానికంగా టైలర్‌గా పని చేయగా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో దుబాయ్ వెళ్లాడు. కొంతకాలానికి అక్కడి నుంచి సౌదీ అరేబియా వెళ్లి, ఓ కంపెనీలో టైలర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 17న విధుల్లో ఉండగానే గుండెపోటు వచ్చి, మృతిచెందాడు. మిత్రుల సహకారంతో అతని మృతదేహం గురువారం ఉదయం స్వగ్రామం చేరింది. మృతుడి భార్యాపిల్లలు గుండెలవిసేలా రోదించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు, గ్రామస్తులు కోరారు.

రేపు గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలం చింతకుంటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎ.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంఈసీ విభాగంలో ఎస్సీ–23, ఎస్టీ–2, బీసీ–4, ఎస్సీ సి–1, మైనారిటీ–1, సీఈసీ విభాగంలో ఎస్టీ–2, బీసీ–1, ఎస్సీ సి–1, ఓసీ–1, మైనారిటీ–1 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు హాజరై, అడ్మిషన్ పొందాలన్నారు. విద్యార్థతల కు సంబంధించి రెండు జిరాక్స్ సెట్లతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

జర్నలిస్టు మహేందర్‌ను ఆదుకుంటాం

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు

కరీంనగర్ కల్చరల్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాక్షి దినపత్రిక స్పోర్ట్స్ జర్నలిస్టు సిలివేరి మహేందర్‌ను ఆదుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ గౌడ్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, కోశాధికారి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డిలు మంత్రిని కలిసి, మహేందర్ ఆరోగ్య పరిస్థితిని వివరించారు. పేద కుటుంబానికి చెందిన ఆయన 10 రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. వైద్యానికి దాదాపు రూ.30 లక్షలు ఖర్చవుతుందని, ప్రభుత్వం తరఫున ఆర్థికసాయం అందించాలని విన్నవించారు. మహేందర్‌కు అన్ని విధాలా సహాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని వారు తెలిపారు.

4 గంటల్లోపు తీసుకొస్తే కాపాడొచ్చు

- గడ్డిమందు తాగిన వారికి హీమోపర్ఫ్యూజన్ పద్ధతిలో చికిత్స
- మెడికవర్ ఆస్పత్రిలో ఒకరిని కాపాడాం
- నెఫ్రాలజీ డాక్టర్ రాంచందర్


మాట్లాడుతున్న డాక్టర్ రాంచందర్

కరీంనగర్‌టౌన్: గడ్డి మందు తాగినవారిని 4 గంటల్లోపు ఆస్పత్రికి తీసుకొస్తే కాపాడొచ్చని కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి నెఫ్రాలజీ డాక్టర్ రాంచందర్ తౌ్రం తెలిపారు. అధిక మోతాదులో ప్రాణాంతక గడ్డి మందు తాగిన వ్యక్తి ప్రాణాలను హీమోపర్ఫ్యూజన్ పద్ధతిలో కాపాడినట్లు పేర్కొన్నారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమ్మికుంటకు చెందిన 46 ఏళ్ల వ్యక్తి సుమారు 150 మిల్లీలీటర్ల గడ్డి మందు తాగి, ఆస్పత్రికి వచ్చాడన్నారు. అతని లివర్, కిడ్నీ, ఊపిరితిత్తులు పూర్తిగా డ్యామేజ్ అయి, పరిస్థితి విషమంగా మారినట్లు వైద్య పరీక్షల ద్వారా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. దీనికి మెడిసిన్ లేదని, పేషెంట్‌కు 5 దశల్లో హీమోపర్ఫ్యూజన్ పద్ధతిలో స్పెషల్ ఫిల్టర్ ద్వారా రక్తంలో నుంచి గడ్డి మందును పూర్తిగా తొలగించామని తెలిపారు. వారం రోజుల చికిత్స తర్వాత పేషెంట్ లివర్, కిడ్నీ, ఊపిరితిత్తులు సాధారణ స్థితికి వచ్చాయన్నారు. డయాలసిస్ నుంచి బయటపడ్డాడని తెలిపారు. బాధితులు హైదరాబాద్ వెళ్లే క్రమంలో విలువైన సమయాన్ని వృథా చేయకుండా కరీంనగర్ మెడికవర్‌లో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక చికిత్స ద్వారా ప్రాణాలు నిలుపుకోవాలని సూచించారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, ఎమర్జెన్సీ హెచ్‌వోడీ డాక్టర్ సత్యనారాయణ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల పాత్ర కీలకం

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి, నాయకులు

కరీంనగర్: విద్యారంగ అభివృద్ధిలో విద్యార్థి సంఘాల పాత్ర కీలకమని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్‌ఎఫ్‌ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12, 13, 14వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాల పోస్టర్‌ను గురువారం వావిలాలపల్లి అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో వస్తున్న మార్పులపై ప్రభుత్వాలు, విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చించడంలో విద్యార్థి సంఘాల ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధి కోసం ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను మన దేశంలోనూ అమలు చేయాలన్నారు. విద్యారంగంపై పరిశోధనలను పెంపొందించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సంఘాలు సామాజిక అంశాలపైనా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంద గణేశ్, రాహుల్, జిల్లా నాయకులు సంపత్, గణేశ్, అరుణ్, నితిన్, గీతాంజలి, వంశీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో ఆరుద్ర నక్షత్రోత్సవం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో ఆరుద్ర నక్షత్రోత్సవం పూజలు గురువారం ఘనంగా జరిగాయి. ఆరుద్ర నక్షత్రం, ఏకాదశి కలిసి రావడంతో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 20 వేల మంది భక్తులు వచ్చారని ఆలయ ఏఈవో శ్రీనివాస్ తెలిపారు. గర్భగుడి దర్శనాలు, అభిషేకాలు, అన్న పూజలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయంలో లక్ష బిల్వార్చన జరిపామన్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు.

భూకబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

వేములవాడ: భూకబ్జాలకు పాల్పడుతుండటంతో వేములవాడ పట్టణానికి చెందిన వోటారికారి భూమేశ్‌ను అరెస్టు చేసినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. వేములవాడ గాంధీనగర్‌లో ఉంటున్న సాంధారికారి వీణ తన అత్త పేరిట జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోచివాడలో ఉన్న ఇంటికి విక్రయించడానికి ప్రయత్నాలు చేసింది. ఆ సమయంలో భూమేశ్ ఆమెకు మాయమాటలు చెప్పి, ఆ ఇంటిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తర్వాత వేరే వ్యక్తికి రూ.45 లక్షలకు విక్రయించాడు. వీణకు గానీ, ఆమె కుటుంబసభ్యులకు గానీ డబ్బులు ఇవ్వలేదు. వారు చాలాసార్లు ఈ విషయమై ప్రశ్నిస్తే రూ.20 లక్షలు ఇచ్చాడు. మిగతావి ఇవ్వాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని కండీషన్ పెట్టడంతో ఇచ్చేశారు. అనంతరం మరో రూ.3 లక్షలు ఇవ్వాలని, లేకుంటే కుటుంబసభ్యులను చంపుతానని వీణను బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం భూమేశ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. అతని చేతిలో మోసపోయిన బాధితులు కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ పరిధిలో ఉన్నారని, ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాఠశాలల్లో జాతీయ క్రీడా దినోత్సవం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి


పారమిత స్కూల్లో క్రీడా జ్యోతి వెలిగిస్తున్న చైర్మన్ ప్రసాదరావు


బిర్లా స్కూల్లో టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి నివాళి అర్పించారు. భారత హాకీ అనగానే మేజర్ ధ్యాన్‌చంద్ గుర్తుకు వస్తారన్నారు. క్రీడారంగానికి ఆయన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని, ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం పలు క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. విద్యాసంస్థల చైర్మన్ ఈ.ప్రసాదరావు క్రీడా జ్యోతిని వెలిగించారు. విద్యార్థులు చేసిన వివిధ క్రీడా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చైర్మన్ మాట్లాడుతూ.. మైదానంలో చెమటోడ్చిన విద్యార్థులే చదువులో ముందుంటారని, క్రమం తప్పకుండా ఆటలు ఆడాలన్నారు. అనంతరం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని, తెలుగు భాషా పండితుడు గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి నివాళి అర్పించారు. మాతృభాష గొప్పతనం–పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్‌రావు, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, రమణ, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవితాప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా స్కూల్లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి స్కూల్ చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్‌లు నివాళి అర్పించారు. క్రీడారంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు రన్నింగ్, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.